## క్లుప్తంగా

### బీఎల్వోలకు నేడు శిక్షణ

కపిలేశ్వరపురం (మండపేట): జాతీయ, రాష్ట్రీయ ఎన్నికల కమిషనర్ల ఆదేశాలపై మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని గ్రామాల పోలింగ్ బూత్‌ల అధికారులకు గురువారం శిక్షణ ఇవ్వనున్నట్టు మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని రోజుకు 45 మంది బీఎల్వోలు తరపున శిక్షణ ఇచ్చామన్నారు. ఆయా మండలాల్లోని మిగిలిన 42 మంది బీఎల్వోలకు మండపేట ఎంపీడీఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎన్నికల నమోదు అధికారి తెలిపారు.

### మండపేటలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' సమావేశం రేపు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలో నియోజకవర్గ స్థాయిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం శుక్రవారం ప్రారంభ సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం తెలిపారు. పట్టణంలోని సూర్య కన్వెన్షన్ హాల్లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి హాజరవుతారన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ వద్దగల సూర్య కన్వెన్షన్ హాల్లో సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ తోట తెలిపారు.

### ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు

కపిలేశ్వపురం (మండపేట): ఆరేళ్ల చిన్నారుల ఆధార్ కార్డులోని వివరాలను నవీకరించుకునే నిమిత్తం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు మండపేటలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మొదటి విడత శిబిరాలను బుధవారం ప్రారంభించామన్నారు. ఈ నెల 18 వరకూ మొదటి విడత, 22 నుంచి 25 వరకూ రెండో విడత శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. 16 నుంచి 18 వరకూ శ్రీరామహిందూ మున్సిపల్ స్కూల్ వద్ద గల రెండో వార్డు సచివాలయంలో, సత్యశ్రీ రోడ్డులోని 14వ వార్డు సచివాలయంలో ఆధార్ వివరాలను నవీకరిస్తారన్నారు. 22 నుంచి 25 వరకూ బురుగుంట చెరువు గోల్డ్ మార్కెట్ వద్ద గల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 4వ వార్డు సచివాలయంలో, వల్లూరివారి వీధిలోని కచేరి చావిడి వద్దగల 7వ వార్డు సచివాలయంలో ఆధార్ వివరాలను నవీకరిస్తారని కమిషనర్ తెలిపారు.

### తాడిపల్లిలో టీబీ ముక్త భారత్ అభియాన్



తాడిపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వాతి భవాని

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాడిపల్లిలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీబీ ముక్త భారత్ అభియాన్ నిర్వహించారు. టీబీ అనుమానితులకు 428 మందికి క్లె పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవాలు పురస్కరించుకుని గ్రామంలో ప్రజలు ఆ వ్యాధి బారిన పడకుండా అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ రెడ్నం సతీష్, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ పిల్లి బాలసుబ్రహ్మణ్యం, వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతి భవాని, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పీఎం ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి




కాజులూరులో ప్రీమియం చెల్లించిన రైతులకు రసీదులు అందిస్తున్న ఏఓ అశోక్

కాజులూరు: 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన' పథకానికి ప్రీమియం చెల్లించి ఈ పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో పలువురి రైతులతో ప్రీమియం చెల్లింపులు చేయించి రసీదులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2025 ఖరీఫ్ పంటకు బీమా పొందాలంటే రైతులందరూ తప్పనిసరిగా రూ.770 ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకులు, సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు సంబంధిత బ్యాంకులలోనే ప్రీమియం చెల్లించవచ్చని, రుణాలు లేనివారు రైతు సేవాకేంద్రాల్లో కాని, సీఎస్‌సీ మీ–సేవ కేంద్రాల్లో కాని ప్రీమియం చెల్లించవచ్చన్నారు. దీని ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో పంటల నష్టం జరిగినప్పుడు రైతుకు పరిహారం లభిస్తుందన్నారు.

# విత్తనం కీలకం

- మంచి విత్తనాలతో అధిక దిగుబడులు
- వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తే మెరుగైన ఫలితాలు

రామచంద్రపురం రూరల్: రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభమైనందున రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు రైతులకు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మంచి విత్తనాల ఎంపిక చేసుకుంటే దిగుబడులు బాగుంటాయని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాల కొనుగోలు ఎంపిక, అమ్మకాలు ఎలా ఉండాలనే దానిపై రామచంద్రపురం మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ అందిస్తున్న సమాచారం ఇలా ఉంది.

**వ్యవసాయశాఖ పాత్ర**

డీలర్లు విక్రయిస్తున్న విత్తనాలు నాణ్యమైనవా? కావా? ఏఏ రకాలు విక్రయిస్తున్నారు? నిర్ణీత ధరకు విక్రయిస్తున్నారా? ఇలా అన్ని విషయాలపై వ్యవసాయశాఖ పర్యవేక్షించాల్సి ఉంటుంది. నిబంధనలను పాటిస్తున్నారా? లేదా? అనేది చూడాలి. అందులో ఏ తేడా కన్పించినా రైతుల కంటే ముందుగా వ్యవసాయశాఖే స్పందించాలి. అవసరమైతే డీలర్లపై కేసు నమోదు చేయడమే కాకుండా షాపు సీజ్ చేసే అధికారం కూడా అధికారులకు ఉంది. అందువల్ల ప్రతి రైతు విత్తనాలు కొనేముందు విధిగా వ్యవసాయశాఖాధికారులను సంప్రదించాలి.

**డీలర్ పాత్ర**

ఏపీ సీడ్స్‌కు దీటుగా డీలర్లు మార్కెట్‌లో మంచి కంపెనీ విత్తనాలను విక్రయించడానికి కృషి చేయాలి. లైసెన్స్, ధర పట్టీలు పొందుపరచాలి. డీలర్లు ముందుగా, మొలక శాతాన్ని చూసుకోవాలి. రైతు మరచిపోయినా బిల్లు కచ్చితంగా ఇవ్వాలి. రోజువారీ నివేదికలు వ్యవసాయశాఖ అధికారులకు సమర్పించాలి. లాభాపేక్షకు పోయి నాసిరకం విత్తనాలు విక్రయించకూడదు. సందేహాలు, అనుమానాలు ఉంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించడం మంచిది. ఎవరికి వారు తమ పరిధిలో జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.

| మండలం | వరి సాగు ఎకరాల్లో.. |
|---|---|
| రామచంద్రపురం | 17,963 |
| కె.గంగవరం | 15,589 |
| కాజులూరు | 19,083 |
| కపిలేశ్వరపురం | 15,763 |
| రాయవరం | 14,101 |
| మండపేట | 16,008 |




విత్తనాలు అమ్మే దుకాణం

**పురుగు మందుల కొనుగోళ్లలో..**

- చీడ, పీడల నివారణకు వినియోగించే క్రిమి సంహారక మందుల కొనుగోళ్ల సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి.
- వ్యవసాయ, ఉద్యానశాఖలు, శాస్త్రవేత్తలు సూచించిన మందులను మాత్రమే వాడాలి.
- అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగు మందులను వాడవద్దు.
- లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- పురుగు మందుల డబ్బాలపై వజ్రాకారంలో పురుగుమందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరిత నీలం రంగు, స్వల్ప విషపూరిత ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- పురుగు మందులు రెండు మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతల్లో పూడ్చిపెట్టాలి. పురుగు మందులు వాడటానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించరాదు.



టీవీఆర్ మణిదీప్, ఏవో, రామచంద్రపురం మండలం

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులో విత్తన రకం, నంబరు, గడువు తేదీ, కొనుగోలు తేదీ, డీలరు సంతకం, రైతు సంతకం బిల్లులో ఉండే విధంగా చూసుకోవాలి.

బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబరు, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి.

- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, సంచి డబ్బాలపై సీలు ఉందా లేదా నిర్ధారించుకోవాలి.
- విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని తీసుకోవాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న విత్తనాలు వాడాలి.
- మొలకశాతం తక్కువగా ఉందనే ఫిర్యాదును సంబంధిత రైతు విత్తిన 10 రోజుల్లోనే మండల వ్యవసాయ అధికారికి రాతపూర్వకంగా తెలియజేయాలి.
- లూజు ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి కొనరాదు. గడువు దాటిన విత్తనాల జోలికి వెళ్ల కూడదు.
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలను తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలను పరిశీలించాలి.
- మొలకెత్తే దశలో, పూత దశలో లోపాలు కనిపిస్తే మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేవరకు దాచి పెట్టుకోవాలి.

అరువు పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.

## సాగునీరందక రైతన్నకు కష్టాలు



నీటి ప్రవాహం మందగించిన నల్లూరు గరువు వద్ద పంటకాలువ

కపిలేశ్వరపురం: మండలంలో పలు గ్రామాల్లోని శివారు భూములకు సాగునీరందక రైతులు యాతన పడుతున్నారు. ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామంటూ ఉన్నతాధికారులు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కానరావడం లేదు.నల్లూరు గ్రామం గరువు ఆయకట్టు శివారులోని సుమారు 100 ఎకరాలకు సాగునీరందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వల్లూరులోని వరాలు కాలువ శివారు ప్రాంతంలోని సుమారు 100 ఎకరాలకు, పాకల దిబ్బ తదితర శివారు ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందడంలేదని రైతులు చెబుతున్నారు. సుమారు 15 రోజుల క్రితం నాట్లు వేశామని, పలు పంట బోదెల్లో పూడిక తొలగించకపోవడంతో నీటి ప్రవాహం తగ్గి సమస్య తలెత్తుతోందని రైతులు చెబుతున్నారు. ఒక పక్క గోదావరి నిండుకుండలా ప్రవహిస్తున్నా తమ భూములకు చుక్కనీరందకపోవడంపై రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ పొలాలకు సాగునీరందించేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

## సాగునీరు లేక.. నారుమడి వేయలేక



యండగండిలో సాగునీరు లేక ఎండిపోతున్న పంట పొలాలు

కె.గంగవరం: మండలంలోని యండగండి గ్రామ పరిధిలో పలు ఎకరాల పంట పొలాలకు సాగునీరు లేక నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామంలో బోర్ల ఆధారంగా సాగు చేస్తున్న రైతులకు చెందిన పంట పొలాల్లో నాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యండగండి ప్రాంతంలోని రైతులు టేకి డ్రైన్ ద్వారా బోర్లు వేసుకుని సాగు చేస్తున్నారు. కానీ ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడంతో బోరు నుంచి నీరు రాక పంట బోదెల నుంచి సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదే విషయంపై విద్యుత్ శాఖ అధికారులను కలిసి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే బోర్లు ద్వారా సాగు చేసే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తాం, రైతుల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణలో మాత్రం కానరావడం లేదని రైతుల విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాయవరం: మండలంలోని పసలపూడి, చెల్లూరు, వెంటూరు సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ నెల 18న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఈపీడీపీసీఎల్ రామచంద్రపురం సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల కటింగ్, లైన్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కారణంగా పసలపూడి, చెల్లూరు, వెంటూరు సబ్‌స్టేషన్ల పరిధిలోని పసలపూడి, వెంటూరు, చెల్లూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి, బుట్టాయిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అంగర, నల్లూరు వ్యవసాయ ఫీడర్స్ మరమ్మతు పనులు, లైన్ల వెంబడి చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఈ నెల 18న ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు బుధవారం తెలిపారు. కపిలేశ్వరపురం, అంగర, పడమరఖండ్రిక, వెదురుమూడి, మాచరమట్టలు, టేకి, శ్రీరాంపురం గ్రామాల వ్యవసాయ, గృహ సంబంధిత వినియోగదారులకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామన్నారు. వల్లూరు వ్యవసాయ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే అంతరాయం ఉంటుందన్నారు.

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాలకు రేపు(శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కె.గంగవరం, శివల ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని 11కేవీ విద్యుత్ వైర్లకు సంబంధించి చెట్ల కొమ్మలను తొలగించడం జరుగుతుందని ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రెండు ఫీడర్లకు సంబంధించి కె.గంగవరం, పాణింగపల్లి, అముజూరు, యండగండి, శివల గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లోని ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదన్నారు.

## ఘనంగా సొసైటీ త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం



ద్రాక్షారామలో సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో మంత్రి సుభాష్, ఎంపీ మాధుర్ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, వెలంపాలెం, కందులపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామలో సొసైటీ చైర్మన్‌గా జనసేనకి చెందిన ముప్పనపల్లి గణేష్, పర్సన్‌లుగా అల్లం రామకృష్ణ, అల్లక మల్లికార్జునరావులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కొత్త సభ్యులకు చైర్‌పర్సన్ గణేష్ చేతుల మీదుగా రైతులకు రూ.21,86,000 రుణాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సంఘ మాజీ అధ్యక్షుడు దామిశెట్టి వీరవెంకట చంద్రశేఖర్, బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కందులపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా వైట్ల శ్రీనివాసరావు, పర్సన్లుగా నరాల నాగేశ్వరరావు, గుంటూరి వీర్రాజు, వెలంపాలెం చైర్‌పర్సన్‌గా చిట్టూరి జానకి రామకృష్ణ, పర్సన్లుగా సుంకర సత్తిరాజు, దంబాల వీరభద్రరావులు ప్రమాణ స్వీకారం చేశారు.

**బయటపడిన కూటమిలో విభేదాలు..**

ఇదిలా ఉండగా ద్రాక్షారామ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో కూటమిలో విభేదాలు బయటపడ్డాయని ఆ పార్టీల నేతలే గుసగుసలాడుకున్నారు. ద్రాక్షారామ సొసైటీ చైర్‌పర్సన్‌గా జనసేన నేత ముప్పనపల్లి గణేష్‌కు అవకాశం ఇవ్వగా ఈ సందర్భంగా వేసిన ఫ్లెక్సీల్లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఫొటోలు వేయకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. అదేవిధంగా మంత్రి సుభాష్‌కు అత్యంత చేరువగా ఉంటూ ప్రతి ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరించే మహిళా నాయకురాలు ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ తన సొంత గ్రామంలో జరిగిన సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరు కాకపోవడంపైన కూడా కూటమి నాయకుల్లో చర్చ జరిగింది.

## అధికారుల నిర్లక్ష్యం.. చెప్పినా పట్టనట్టే..

- మద్యం షాపులు తొలగించడంలో అలసత్వం
- కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ధ్వజం
- గతంలో చేసిన విజ్ఞప్తులపై స్పందన కరవు



మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని జనవాసాల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపులను తొలగించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో డిమాండ్ చేశారు. బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మైనారిటీ కో–ఆప్షన్ సభ్యుడి ఎన్నికకు అందిన దరఖాస్తులను పరిశీలించడమే ప్రధాన అజెండాగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. పట్టణంలోని పలు సమస్యలను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమావేశంలో లేవనెత్తారు. 29వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ టౌన్ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, మండపేట మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో ఉన్న రహదారి నిత్యం మందుబాబులతో రద్దీగా ఉంటోందని, సాధారణ ప్రజలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

**సమస్య తీవ్రతను గుర్తించాలి**

జనావాసాల్లో మద్యం షాపులను తొలగించాలని సమావేశాల్లో కోరుతున్నప్పటికీ చర్యలు తీసుకోలేదని శ్రీనివాస్ ప్రశ్నించారు. కమిషనర్ టీవీ రంగారావు పట్టణంలో తెల్లవారుజామున కాకుండా మద్యం షాపులు తెరిచి ఉన్న సమయంలో వీధుల్లో పర్యటిస్తే సమస్య తీవ్రత తెలుస్తుందన్నారు. ఇటీవల మద్యం మత్తులో ఓ యువకుడు మద్యం షాపు సమీపంలోని డ్రెయిన్‌లో పడి మృతి చెందిన ఘటనను ఆయన ప్రస్తావించారు. రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలని గత సమావేశాల్లో డిమాండ్ చేసిన విషయంపై మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం సరైంది కాదన్నారు. 17వ వార్డు మెండి బాపిరాజు మాట్లాడుతూ, పట్టణంలోని పార్కులు, నివాసిత ప్రాంతాల్లో దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ ఇబ్రహీం

**మైనారిటీ కో–ఆప్షన్ సభ్యుడిగా ఇబ్రహీం**

మండపేట మున్సిపల్ కౌన్సిల్ మైనారిటీ కో–ఆప్షన్ సభ్యుడిగా పట్టణానికి చెందిన షేక్ ఇబ్రహీం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నూర్ భాషా సంఘం అధ్యక్షుడైన షేక్ ఇబ్రహీం ఒక్కరే దరఖాస్తు చేయడంతో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చైర్‌పర్సన్ దుర్గారాణి ప్రకటించారు. రానున్న సమావేశంలో షేక్ ఇబ్రహీం కో–ఆప్షన్ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేస్తారని పేర్కొన్నారు.

## మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దారుణం




మేడిశెట్టి సత్యవేణి, ఎంపీపీ, కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీ చైర్‌పర్సన్ సభ్యురాలు ఉప్పాల హారికపై దాడి జరగడం హేయమైన చర్య అని ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంపీపీల విభాగం ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి సత్యవేణి అన్నారు. కూటమి నేతలు అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగంతో మహిళా ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాస్తున్నారని అన్నారు. కూటమి పాలనలో జిల్లా ప్రజాప్రతినిధికే రక్షణ కరువైందన్నారు. ప్రజలు అధికారమిచ్చింది హామీలను అమలు చేసి మేలు చేస్తారని, కనీస బాధ్యత కూడా లేకుండా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే లక్ష్యంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ దాడులు ప్రజలకు తెలియకుండా ఉండేలా సాక్షి ఛానల్ ప్రసారాలను నిలిపివేయడం అప్రజాస్వామికమన్నారు. ఉప్పాల హారికపై జరిగిన దాడిలో వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రసారాలు చేస్తున్న ఛానళ్లకు పూర్తి స్వేచ్ఛనివ్వడం దారుణమని సత్యవేణి అన్నారు.

## కూళ్ల వాటర్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మృతి

కపిలేశ్వరపురం: తాతపూడికి చెందిన కూళ్ల వాటర్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్, తాతపూడి నీటి సంఘం అధ్యక్షుడు మేకా శివప్రసాద్ (50) బుధవారం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నెల 13న కొత్తూరు సెంటర్ నుంచి స్వగ్రామం తాతపూడికి మోటార్ బైక్‌పై వస్తుండగా తాతపూడి–సూర్యాపేట రహదారిలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. శివప్రసాద్ తలకు తీవ్ర గాయమైంది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## విద్యా హక్కు చట్టం అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం




ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ ప్రజా సంఘాల నేతలు

రామచంద్రపురం: విద్యా హక్కు చట్టం అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ అన్నారు. పేద విద్యార్థుల హక్కులను కాలరాసే ప్రభుత్వ వైఖరి తక్షణమే మారాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం పీడీఎస్‌యూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టి, ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. సిద్ధూ మాట్లాడుతూ రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం కింద ప్రభుత్వ ఖర్చుతో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులపై ప్రభుత్వం ఘోరమైన నిర్లక్ష్యం చూపుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడం వల్ల తల్లిదండ్రులు, విద్యార్థులు అవమానాలను ఎదుర్కొంటున్నారన్నారు. రామచంద్రపురం, మండపేట, రాయవరం, కె.గంగవరం, కాజులూరు, కపిలేశ్వరపురం మండలాల్లో లక్షల్లో ఫీజు బకాయిలుగా ఉండటంతో స్కూళ్లలో విద్యార్థులను తరచూ తరగతుల నుంచి బయటకు పంపిస్తున్నారన్నారు. విద్యే తమకు జీవిత సాధనమని ఆశతో ఆర్టీఐ ద్వారా చేరిన పేదల పిల్లలు ఇప్పుడు నిరాశలో మునిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ స్కూళ్ల దౌర్జన్యాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వం చేతులు పైకి ఎత్తేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 97,000 మంది విద్యార్థులు ఈ పథకానికి లోబడి ఉన్నా, ఒక్కో విద్యార్థికి సుమారు రూ.8 వేలు చొప్పున పెండింగ్ బిల్లులు ఉన్నాయంటే, రాష్ట్ర స్థాయిలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్టీఈ 12(1)(ఇ) ద్వారా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ, వికలాంగ, అనాథ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని నేరుగా స్కూల్ వారి బ్యాంకు ఖాతాకు ఎనిమిది వేల రూపాయలు జమ చేస్తామని కూటమి ప్రభుత్వం జీఓ 9ను 12.06.2025న తెచ్చిందని, కానీ తల్లికి వందనం పథకాన్ని ఉచిత సీట్లు పొందిన విద్యార్థులకు హోల్డ్‌లో పెట్టిందన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను ముక్కు పిండి వసూలు చేస్తున్నాయన్నారు. మధ్యాహ్నం రెండు గంటల్లోపు స్కూల్ నుంచి తీసుకుపోవాలని తల్లిదండ్రులు మీద ఒత్తిడి చేస్తున్నారని, ఆర్టీఈ ద్వారా సీట్లు పొందిన విద్యార్థుల మీద వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీఈ ద్వారా చదువుతున్న విద్యార్థుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా తూర్పుగోదావరి జిల్లా పీవైఎల్‌వీ నాయకులు భీమశంకరం, అంబటి కృష్ణ, కె.శివ, వి.నాగరాజు, కె.నవీన్, కె.రవి, కె.సురేష్, ఎం.సూరిబాబు, ఎం.నానాజీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీమార్గమే రాజమార్గం



ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం: రాజీ చేయదగ్గ కేసుల్లో కక్షిదారులు వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా వారికి రాజీమార్గమే రాజమార్గమని 'మధ్యవర్తిత్వం ద్వారా కేసులు సత్వర పరిష్కారం' అవుతాయని లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం న్యాయవాదులు 'మధ్య వర్తిత్వం' మేలు అంటూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కక్షిదారులు పట్టుదలకు పోకుండా మంచి ఆలోచన చేసినట్లయితే సత్వరమే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏజీపీ లకానీ పద్మ కమలకుమారి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు వరాహ నరసింహమూర్తి, స్పోర్ట్స్ సెక్రటరీ సాదే నారాయణరావు, మాజీ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, మధ్యవర్తత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, కేవీ సత్యవాణి, బండి శ్రీనివాస్, సన్నపు బాలసుబ్రహ్మణ్య కుమారస్వామి, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.